మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 106 | మంగళవారం | 30 - 09 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## కూటమి ప్రభుత్వ పాలన... అద్భుతం



8లో..




# ఘనంగా డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం

మన గళం, విజయవాడ : ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ (ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విజయవాడ కుంచన పల్లిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా డైరెక్టర్ల ప్రమాణస్వీకారం సాగింది. ముందుగా ప్రమాణ స్వీకారం చేయనున్న డైరెక్టర్లు, నాయకులతోపాటు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్ధసారథి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించారు. పరిచయ కార్యక్రమం అనంతనంతరం ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్ సమక్షంలో ఏపీఇడ బ్ల్యూఐడీసీ ఎండీ సీఎన్ దీవన్ రెడ్డి.... డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కర్నూలు బీజేపీ నేత నగరూరు రాఘవేంద్రతోపాటు అబ్బూరి రమేష్ నాయుడు, బేరా వేణమ్మ, చీకటి సుహాసిని, దివ్వెల మధుబాబు, గోన చెన్నకేశవులు, జీ నాగముని, మోహన్ జగదీష్ బాబు, పోకూరి రాంబాబు, అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, రమాదేవి, సాయి బాబు, తిరుమల శెట్టి శ్రీహరి, ఉయ్యాల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లను సన్మానించారు. శాలువాలు కప్పి సత్కరించారు. నాయకులు, రాజకీయ ప్రముఖులు, స్నేహితులు, బంధువులు డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.















## నటుడు విజయ్ టీవీకే పార్టీ సభలో తొక్కిసలాట

### మరో మహిళ మృతితో 41కి చేరిన మృతుల సంఖ్య

మన గళం డెస్క్ : నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ నిర్వహించిన ప్రచార సభలో పెను విషాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన ఈ సభలో తొక్కిసలాట జరిగి మృతుల సంఖ్య 41కి చేరింది. మరో 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే... శనివారం 2 లో..

## వేధింపులతో యువ డాక్టర్ ఆత్మహత్య



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర షిర్డీలో ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన మరీదు వినోద్ (30) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన మరీదు కిషోర్, కోటేశ్వరి దంపతులకు వినోద్ ఏకైక కుమారుడు.. వినోద్ ను ఉన్నతంగా చదివివించారు.. వినోద్ డాక్టర్ కావాలని కలలు కన్నాడు. రష్యాలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు.. ఆ తర్వాత షిరిడీలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ప్రస్తుతం పీడియాట్రిక్ లో వినోద్ ఎండీ కోర్సు చదువుతున్నాడు. మరో ఆరు 2 లో..

## మహారాష్ట్రలో మత ఘర్షణలు..



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: 'ఐ లవ్ మహమ్మద్' వివాదంపై మహారాష్ట్రలోని అహిల్యానగర్ లో మత ఘర్షణలు చోటుచేసు కున్నాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు 2 లో..

## షర్మిల మత ప్రచారం చేశారు



### - వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా?

మన గళం, న్యూఢిల్లీ : హిందువుల మనోభావాలకు విఘాతం కలిగించేలా ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి వ్యాఖ్యలు చేశారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్ఎస్ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని 2 లో..

## కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

### - విజయవాడ దుర్గమ్మను సతీసమేతంగా దర్శించుకున్న సీఎం చంద్రబాబు



మన గళం, విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మకి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం తరపున దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖ సంతోషాలు అందించాలని అమ్మవారిని 2 లో..

## మేడపైకి తీసుకెళ్లి యువతిని హత్యచేసిన తండ్రి



మన గళం డెస్క్ : ఏ తండ్రైనా కన్నబిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటాడు. ఆమెకు విద్యాబుద్ధులు నేర్పించి, మంచి సంబంధం చూసి, పెళ్లిచేసి 2 లో..

# నటుడు విజయ్ టీవీకే పార్టీ సభలో తొక్కిసలాట

సాయంత్రం వేలాయుధంపాలెంలో ఏర్పాటు చేసిన సభకు విజయ్‌ను చూసేందుకు వేలాదిగా అభిమానులు, కార్యకర్తలు పోటెత్తారు. అంచనాలకు మించి జనం రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. విజయ్‌ను దగ్గర నుంచి చూసేందుకు ప్రజలు ఒక్కసారిగా ముందుకు తోసుకురావడం, అదే సమయంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. బయటకు వెళ్లే దారులు ఇరుకుగా ఉండటంతో తొక్కిసలాట జరిగి, ఊపిరాడక చాలామంది కిందపడిపోయారు. చాలామంది వారిని తొక్కుకుంటూ వెళ్లడంతో ఈ ఘోర దుర్ఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వేలుసామిపురానికి చెందిన సుగుణ (65) అనే మహిళ మరణించడంతో మృతుల సంఖ్య 41కి పెరిగింది. ఇక, ఘటన జరిగిన వెంటనే కరూర్ చేరుకున్న సీఎం ఎం.కె. స్టాలిన్, మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 10 లక్షల నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. భద్రతా లోపాలపై విచారణ జరిపేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అరుణా జగదీశన్‌తో న్యాయ విచారణకు ఆదేశించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని నటుడు విజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది "పూడ్చలేని లోటు" అని, తన హృదయం తీవ్రమైన భారంతో నిండిపోయిందని అన్నారు. మృతుల కుటుంబాలకు తనవంతుగా రూ. 20 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తానని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

మరోవైపు, ప్రజల రాకను అంచనా వేయడంలో పోలీసు, నిఘా వర్గాలు విఫలమయ్యాయని, ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రతిపక్ష నేత పళనిస్వామి ఆరోపించారు. అధికారులు కేసు నమోదు చేసుకుని, సభల నిర్వహణలో భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

## వేధింపులతో యువ డాక్టర్ ఆత్మహత్య





నెలల్లో కోర్సు పూర్తి కానుంది.. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీలో హెచ్‌ఓడీ, కొందరు సిబ్బంది వేధింపులు గురి చేయడంతో మనస్థాపానికి గురైన వినోద్.. తన రూమ్ లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తల్లి దండ్రులు కష్టపడి, అప్పులు చేసి ఎన్నో ఆశలతో కొడుకును ఎంబిబిఎస్ చదివించారు.. పీజీ కూడా పూర్తి చేయించి..డాక్టర్ గా చూడాలని వారు ఎన్నో కలలు కన్నారు.. ఇంతలోనే.. వారి ఆశలు అడియాశలయ్యాయి.. వినోద్ చిన్నతనం నుంచి చదువుల్లో మెరిట్ స్టూడెంట్.. అని.. చదువే లోకంగా ఉండేవాడని గ్రామస్థులు తెలిపారు. వినోద్ ను తరచూ అవమానాలకు గురిచేయ్యడంతోపాటు.. వేధింపులకు గురిచేయ్యడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతితో తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.. వినోద్ మృతితో రాయన్నపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి..

## మహారాష్ట్రలో మత ఘర్షణలు..

పోలీసులు లాఠీచార్జి జరిపారు. 30 మందిని అరెస్టు చేశారు. అహిల్యానగర్ సిటీలోని మలివాడ ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు 'ఐ లవ్ మహమ్మద్' రంగోలిని ఏర్పాటు చేశారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఆగ్రహిస్తూ ఒక వర్గానికి చెందిన వందలాది మంది సిటీలోని కొత్వాలి పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనలకు దిగారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వదంతులు నమ్మరాదని ప్రజలను కోరారు. కాగా, రంగోలి వేసిన వ్యక్తులను స్థానిక పోలీసులు గుర్తించారు. ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకరు పోలీసు కస్టడీలో ఉన్నారు. రంగోలి వివాదంతో రోడ్లపైకి వచ్చిన పలువురిని అదుపు చేసేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి జరిపారు. అహిల్యానగర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశామని, ప్రజలు వదంతులు నమ్మరాదని పోలీసులు కోరారు.

## మేడపైకి తీసుకెళ్లి యువతిని హత్యచేసిన తండ్రి



పంపిస్తాడు. కానీ ఓ యువతి తండ్రి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించాడు. మేడపైకి తీసుకెళ్లి దారుణంగా కాల్చిచంపాడు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏందంటే ఆమె 15 ఏళ్ల తమ్ముడు కూడా ఈ హత్యలో పాలుపంచుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షామ్లీ జల్లా కాండ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబెహ్తా గ్రామంలో ముస్కాన్ అనే 17 ఏళ్ల యువతి కుటుంబంతో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఆమె ఫోన్ చాటింగ్ చూసిన తండ్రి యువతిని మేడపైకి తీసుకెళ్లాడు. యువతి 15 ఏళ్ల తమ్ముడు కూడా అక్కను దూషిస్తూ వారితో వెళ్లాడు. పైకి వెళ్లిన తర్వాత ఆ యువతిని పిస్తల్‌తో కాల్చిచంపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు. నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేశారు. ముస్కాన్ ఓ అబ్బాయితో చాటింగ్ చేస్తూ తమ కుటుంబం పరువు తీస్తోందని, అందుకే చంపేశామని పోలీసుల విచారణలో నిందితులు వెల్లడించడంతో ఆశ్చర్యపోవడం పోలీసుల వంతయ్యింది.

# కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు





కోరుకున్నానని తెలిపారు.

దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని.. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ జలకళతో ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని.. రాష్ట్ర సంపద పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఇప్పటి వరకూ 8 లక్షల మంది భక్తులు.. దుర్గమ్మ వారిని దర్శించుకున్నారని వివరించారు. ఈ రోజు ఒక్క రోజే 1.20 లక్షల మంది భక్తులు.. దుర్మమ్మను దర్శించుకున్నారని పేర్కొన్నారు. అమ్మ వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. పవిత్రతను కాపాడుతూ.. అధిక మంది భక్తులకు దర్శన భాగ్యం కల్పించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రసాదంలో నాణ్యత పెంచామని.. అలాగే వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించామన్నారు. అయితే అమ్మవారి దర్శనాల్లో అధిక సమయం సాధారణ భక్తులకే కేటాయించామని తెలిపారు. దుర్గమ్మ ఆశీస్సులతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దుర్గమ్మ ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని చెప్పారు. 2014-19 మధ్య కాలంలోనే దుర్గ గుడి అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నేడు మళ్లీ అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. దాతల సహకారంతో యాగశాల నిర్మిస్తామన్నారు. రూ. 14 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ వంటి పనులు చేపట్టామని వీటిని ఐదు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

2027 గోదావరి, 2028 కృష్ణా పుష్కరాలు కూడా ఘనంగా నిర్వహిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు దుర్గమ్మ దీవెనలుండాలని పేర్కొన్నారు. దసరా సందర్భంగా విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. దసరా అంటే విజయవాడ గుర్తుకు వచ్చేలా కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. తిరుమల కొండపై ఉన్నంత స్థలం.. ఇంద్రకీలాద్రిపై లేదన్నారు. విజయవాడ నగరంలోనే వసతి ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని.. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. ఆదాయం లేని దేవాలయాలకు ప్రభుత్వం నిధులు అందిస్తుందన్నారు. ప్రముఖ దేవాలయాలకు నగదు కొదవ లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మేళ తాళాలు.. మంగళ వాయిద్యాలతో వారికి పూర్ణకుంభంతో వేద పండితులు, ఆలయ అధికారులు, మంత్రులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం దంపతులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఈ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ క్రమంలో అమ్మవారి లడ్డూ ప్రసాదంతోపాటు దుర్గమ్మ చిత్రపటాన్ని చంద్రబాబు దంపతులకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు. సీఎం దంపతులకు స్వాగతం పలికిన వారిలో.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎంపీ కేశినేని చిన్నితోపాటు పలువురు మంత్రులు ఉన్నారు.

# షర్మిల మత ప్రచారం చేశారు

పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఇవాళ(సోమవారం) మీడియాతో మాట్లాడారు. వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా? అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల చేసిన వ్యాఖ్యలకు గానూ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. టీటీడీ నిధులు ఎలాంటి దుర్వినియోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ్ వెల్లడించారు.

# విద్యార్థులకు ఇది గొప్ప కానుక

**- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,788 కోట్లు చెల్లించిన కూటమి సర్కార్**

**- జగన్ హయాంలో పేరుకుపోయిన బకాయిలంటూ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు**

**- లక్షలాది మంది విద్యార్థుల సర్టిఫికెట్ల విడుదలకు చర్యలు**

**- పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే కొనసాగిస్తామని స్పష్టీకరణ**

**- విద్యాశాఖలో లోకేశ్ నాయకత్వంలో విప్లవాత్మక సంస్కరణలని వెల్లడి**

**- రాష్ట్రాన్ని "బెస్ట్ నాలెడ్జ్ హబ్"గా మార్చడమే లక్ష్యమన్న మంత్రి**



మన గళం, అమరావతి : రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్లో భాగంగా రూ. 1,788 కోట్లను విడుదల చేసినట్లు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రకటించారు. పండుగ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందించిన గొప్ప కానుక ఇదని ఆయన అభివర్ణించారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క పేద విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 2,832 కోట్లు, వసతి దీవెన కింద రూ. 989 కోట్లు, పీజీ ఫీజుల కింద రూ. 450 కోట్లు బకాయిలు పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారని ఆరోపించారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేశాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ప్రజాధనాన్ని రంగుల పిచ్చికి, పేరులేని కంపెనీలకు ట్యాబ్‌ల కాంట్రాక్టుల రూపంలో దుర్వినియోగం చేశారని ఆయన మండిపడ్డారు. విద్యా కానుక నిధులను సైతం తాడేపల్లి ప్యాలెస్ పనులకు వాడుకున్నారని ఆరోపించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 10 లక్షల మందికి పైగా విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని, ఫీజుల కోసం విద్యార్థులను వేధించే కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషితో పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తిరిగి అమలు చేస్తున్నామని, దీని ద్వారా తల్లిదండ్రులపై భారం తగ్గుతుందని వివరించారు. ఫీజు బకాయిలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని తాము సవాల్ విసిరితే, నిజాలు బయటపడతాయనే భయంతో వైసీపీ నేతలు పారిపోయారని ఎద్దేవా చేశారు.

మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో విద్యాశాఖలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నామని కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పారదర్శకంగా పేరెంట్ - టీచర్ మీటింగ్‌లు నిర్వహించామని, 'డొక్కా సీతమ్మ భోజనం' పథకం ద్వారా నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని, 'తల్లికి వందనం' పథకంతో ప్రతి బిడ్డకు మేలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేశామని, మెగా డీఎస్సీ నిర్వహించి తొలి సంతకం హామీని నిలబెట్టుకున్నామని గుర్తుచేశారు.

మంగళవారం
30 - 09 - 2025

మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

# పెట్రోల్ పంప్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి



మనగళం, కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు

**– నగరపాలక మేనేజర్ ఎన్.చిన్నరాముడు**

నగరపాలక సంస్థ పెట్రోల్ పంప్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని మేనేజర్ ఎన్.చిన్నరాముడు సిబ్బందిని ఆదేశించారు. ఆయన పాత బస్టాండ్‌లోని కేఎంసి పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. రికార్డులు, హాజరు తనిఖీ చేసి, కార్పొరేషన్ ఆదాయానికి ముఖ్యమైన ఈ పంప్‌లో నిర్లక్ష్యం, పొరపాట్లకు తావు ఇవ్వొద్దని సూచించారు. ఎల్లప్పుడూ ఇంధనం అందుబాటులో ఉంచి, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు.

# ఘనంగా గుర్రం జాషువా జయంతి



మనగళం, కర్నూలు సిటీ : నవయుగ కవి, పద్మాభూషణ్ గుఱ్ఱం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ వీరశైవ లింగాయత్ లింగ బలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ స్వప్న, బీజేపీ నాయకుడు వేల్పుల గోపాల్ గుఱ్ఱం జాషువా సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటియాదవ్, వీరప్ప, మంజునాథ్, బెస్త ఈరన్న, విజయ్, మనోహరి, సురేష్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నగర సుందరీకరణ పనులు వేగవంతం

**– నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**



మనగళం, కార్పొరేషన్ : కర్నూలు నగర ప్రధాన రహదారుల వెంట సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారపేట, కలెక్టరేట్, గాయత్రి ఎస్టేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేస్తూ, నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ గిరిరాజ్, పట్టణ ప్రణాళికాధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువా

**– మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర బాబు**



మనగళం, కర్నూలు సిటీ : తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువ కవి అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ మెంబర్ ఎం సుధాకర బాబు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 130 వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సుధాకర బాబు మాట్లాడుతూ వీరయ్య, లింగమ్మ దంపతులకు గుఱ్ఱం జాషువ 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించారని, చిన్నప్పటి నుంచే కుల వివక్ష కారణంగా అవమానాలు ఎదుర్కొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిగా సేవలు అందించిన ఆయన రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకుడిగా పని చేశారని గుర్తు చేశారు. 1964లో శాసనమండలిలో సభ్యత్వం పొందాడని, జాషువా 36 గ్రంథాలు, ఎన్నో కవితా ఖండాలు రాశారని, కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారం, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ పురస్కారాలు పొందారని వివరించారు. ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎన్ సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్, నాయకులు శివకుమార్, కేశవరెడ్డి, మద్దిలేటి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# శివప్ప నగర్ కాలనీలో రోడ్లు నిర్మించాలి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరపాలక సంస్థ కల్లూరు 35 వ వార్డు శివప్ప నగర్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు బికే రామకృష్ణ వార్డ్ కార్యదర్శి బి.పరమేష్ సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడి దాదాపు 20 సంవత్సరాలు అవుతున్నదని, నేటికీ కనీస మౌలిక వసతులు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, శ్రీనివాసులు, మాధవ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ

**– దివ్యాంగులకు సహకారం నిరంతరం కొనసాగిస్తాం**
**– డాక్టర్ రవి కృష్ణ**




మనగళం, నంద్యాల నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణలో సోమవారం సంఘం కార్యాలయంలో ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకుని, 20 మంది దివ్యాంగులకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్ సౌజన్యంతో పదిహేను వేల రూపాయల విలువచేసే నెల వారి మందుల పంపిణీ చేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య పాల్గొని మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ నిరంతరం కొనసాగిస్తామన్నారు. మందులు కొనుగోలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఒక నెల మందులు ఉచితంగా అందిస్తున్న రవి ప్రకాష్ కు ధన్యవాదాలు తెలిపి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. దాత రవి ప్రకాష్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలు అందించడం వ్యక్తిగత సామాజిక బాధ్యతగా భావించి సహకరిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య, కార్యాలయ కార్యదర్శులు మధు,వెంకటేశ్వర్లు, సూర్య, దివ్యాంగ లబ్ధిదారులు వారికి తోడుగా వచ్చిన వారు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకం మీద మండల స్థాయి మరియు సచివాలయం అధికారులకు అవగాహన కార్యక్రమం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పథకం మీద మండల స్థాయి అధికారులకు సచివాలయం సిబ్బందికి అందరికి కూడా అవగాహన కల్పించడం జరిగినది ఈ అవగాహన కార్యక్రమానికి ఎంఆర్ఓ మరియు ఎండిఓ కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ డిప్యూటీవో డిప్యూటీ ఏసి ఈ సమావేశానికి హాజరయ్యారు ఈ సమావేశంలోని ముఖ్య విషయాలను ప్రజలందరూ కూడా తెలియాలని ప్రభుత్వం వారు జీఎస్టీ రూపంలో తగ్గించినటువంటి జీఎస్టీ ధరలు ప్రతి ఇంటికి చేరాలని సదుద్దేశంతో జిఎస్టి ఫలాలు ప్రతి ఒక్క పౌరుడు పొందేలాగా షాప్ కీపర్స్ దగ్గర సరుకులు కొనేటప్పుడు ఖచ్చితంగా ధరలు తగ్గిన మేరకే అమ్మాలని వారు షాప్ కీపర్ స్కూల్ తగు సూచనలు అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు అదేవిధంగా ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని అధికారులకు తెలియజేశారు అలాగే ప్రజలు కూడా షాప్ కీపర్ దగ్గర తగ్గిన జిఎస్టి ధరలను గమనించి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఏసి కమర్షియెంట్ డిపార్ట్మెంట్ రమాదేవి ఎమ్మార్వో నాగరాజు ఎంపీడీవో రాముడు స్థానిక మండల స్థాయి అధికారులు సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు




## కోడుమూరులో ముస్లింల స్మశాన వాటిక నిర్మాణం కోసం మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలిసిన ముస్లిం సోదరులకు



మన గళం కోడుమూరు: కోడుమూరు టిడిపి సీనియర్ నాయకులు కేడీసీసీ చైర్మన్ శ్రీ డి విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరు పట్టణ ముస్లిం సోదరులకు ఇచ్చిన మాట ప్రకారం వారి స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ మరియు సిసి రోడ్డు ఎస్టిమేషన్స్ తయారు చేయించి గౌరవ న్యాయశాఖ మరియు మైనారిటీ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కోడుమూరు పట్టణ ముస్లిం సోదరుల స్మశాన వాటిక సమస్యను గూర్చి వివరించారు కచ్చితంగా వారికి కాంపౌండ్ వాల్ మరియు సిసి రోడ్డు వేయించాలని ఈ సందర్భంగా మంత్రివర్యులకు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు సమస్యను తెలుసుకున్న మంత్రివర్యులు వెంటనే స్పందించి కాంపౌండ్ వాల్ కు మరియు సిసి రోడ్డుకు తగు ఎస్టిమేషన్స్ అమౌంట్ను ప్రభుత్వ నిధులు ద్వారా సాంక్షన్ చేయిస్తానని హామీ ఇచ్చారు మంత్రివర్యులు ఎన్ ఎమ్ డి ఫరూక్ హామీ ఇవ్వడంతో కోడుమూరు పట్టణ ముస్లిం సోదరులు శ్రీ డి విష్ణువర్ధన్ రెడ్డికు మరియు మంత్రివర్యులు ఎన్ ఎమ్ డి ఫరూక్ కు ఈ సందర్భంగా ముస్లిం సోదరులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిడిపి చైర్మన్ మల్లికార్జున గౌడ్ కోడుమూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎల్లప్ప నాయుడు కోడుమూరు టిడిపి పట్టణ అధ్యక్షులు సింగిల్ విండో డైరెక్టర్ గంగాధర్ నాయుడు కోడుమూరు టీడీపీ మండలం ప్రధాన కార్యదర్శి రాజు దావుద్ బాషా ఆఫ్ సాప్, ఇంతియాజ్ భాషా, నిహార్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ముగిసిన బిందే సేవ...





మన గళం అవుకు : నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి కి బిందే సేవ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు . అందులో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన అర్చకులు హరికృష్ణ శాస్త్రి నిర్వహించారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయ సమీపంలోని శివాలయం వద్దకు ఆర్యవైశ్యులు,ఆర్యవైశ్య మహిళలు చేరుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వాసవి మాతాను పెళ్ళికాని ఆర్యవైశ్య యువకులు మోసుకుంటూ పట్టణ పురవీధుల వెంట మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొని అమ్మవారి శాలకు చేరుకోవడం ఆనవాయితీ. ఈ ఊరేగింపులో ఆర్యవైశ్య మహిళలు నృత్యం చేసుకుంటూ అమ్మవారికి స్వాగతం పలకడం జరిగింది. మూల నక్షత్ర సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవి గా అలంకరణ చేయడం జరిగింది. తాళేపల్లె నాగేంద్ర కుమార్ ధర్మపత్ని రాధాదేవి, మేడం వెంకటేశ్వర్ గుప్తా ధర్మపత్ని శరావతి, మేడం రవిశంకర్ ధర్మపత్ని ప్రసన్న లక్ష్మి పూజ ఉభయదారులుగా వ్యవహరించారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ - ఆర్చి నిర్మాణం చేపట్టాలి

మనగళం, నంద్యాల నంద్యాల ముస్లిం జాయింట్ ఆక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మరియు పీస్ ఫౌండేషన్, సలీంనగర్ అధ్యక్షులు సమీయుల్లాల ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్ మున్సిపల్ చైర్పర్సన్ మబ్బున్నిసా, మున్సిపల్ కమిషనర్ శేషన్న, కౌన్సిల్ సభ్యులను కలిసి నంద్యాల పట్టణంలో సలీం నగర్‌లో మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా " "మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్" అనే పేరు తో ఒక ఆర్చి ని మున్సిపాలిటీ వారు తమ ఖర్చులతో నిర్మించాలని వినతి పత్రాలు అందజేయడం జరిగింది. మంత్రిగారు, చైర్మన్, అధికారులు, కౌన్సిలర్లు సుముఖంగా స్పందిస్తూ, తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

వారు మాట్లాడుతూ, స్వాతంత్ర సమరయోధుడు, మొట్టమొదటి విద్యామంత్రి, ఇస్లామిక్ పండితుడు అయిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి స్మృతిలో గతంలో "మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్ (మాకా సర్కిల్)" అని నామకరణం చేయడం జరిగింది. నంద్యాలలో ఉన్న ముస్లిం ప్రజా సంఘాలన్నీ కలిసి సుదీర్ఘ పోరాటం తర్వాత ఈ సర్కిల్‌ను సాధించుకున్నాము. ఇస్లాం మతంలో విగ్రహాలు పెట్టడం మత విరుద్ధం కావున, ఇక్కడ ఆయన పేరుతో ఒక స్థూపం కట్టడం జరిగింది. కానీ, నేడు ఈ సర్కిల్‌కు పెట్టబడిన పేరు చిన్న అక్షరాలతో స్థూపం కింద ఎక్కడో ఉండటం వల్ల, దానిని వెతికి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్మృతిని తగ్గించే విధంగా ఉంది. కాబట్టి, ఈ ప్రాంతంలో మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఒక పెద్ద ఆర్చి నిర్మించి, దానిపై "మౌలానా అబుల్ కలాం ఆజాద్ సర్కిల్" అని స్పష్టంగా రాయించాలని, ఈ విషయమై మున్సిపాలిటీ వారు తగిన చర్యలు తీసుకుని, తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇది నంద్యాల పట్టణంలో చారిత్రక ప్రాధాన్యతను కాపాడటమే కాకుండా,



సమాజంలో శాంతి మరియు ఐక్యతను పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాబా ఫక్రుద్దీన్, కౌన్సిలర్ బాసిత్, నూర్ బాషా, ఎస్ డి పి ఐ మజీద్ ఖాన్, వెజిటబుల్ మార్కెట్ అధ్యక్షులు అర్షద్ హుస్సేన్, జబ్బార్,జావీద్, సుహేల్ జక్కీవుల్లా , హిదాయతుల్లా ఖాన్, గౌస్ పీర్ పైలెట్, ముర్షద్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయాలను డిజిటలైజ్ చేయండి

- న్యాయం తప్పకుండా చేస్తాం - మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

మనగళం, నంద్యాల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైసీపీ నేతలపై, కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలు, మర్డర్లు, కక్షపూరిత చర్యలను అన్నింటిని రిజిస్టర్ చేసేందుకు రూపొందించిన డిజిటల్ బుక్ కోసం క్యూఆర్ కోడ్ ద్వార స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో డిజిటల్ బుక్ లో నమోదు కొరకు రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, వైసీపీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా మాజీ మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు డా.శశికళారెడ్డి, నంద్యాల మండల వైసీపీ అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, డిస్ట్రిక్ట్ ఇనటలెక్చువల్ ప్రసిడెంట్ రసూల్ ఆజాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవనగర్ బాష, డిస్ట్రిక్ట్ స్పోక్ పర్సన్ అనీల్ అమృతరాజ్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, , ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, నెరవాటి సత్యనారాయణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, మర్డర్లు, కక్షసాధింపు చర్యలు, ఆస్తుల



విధ్యంసం, ఆక్రమణలు, ఇలా అనేక అన్యాయాలకు తెరతీసిందని అన్నారు. ఇటువంటి చర్యలను కాలం మరచిపోవచ్చని, జరిగిన అన్యాయాలను, అక్రమాలను మరచి పోకుండా బధ్రపరిచేందుకు వైఎస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ను రూపొందించడం జరిగిందని, ఇవ్వబడిన క్యూర్ కోడ్ ను స్కాన్ చేసి అందులో జరిగిన అన్యాయాలను రిజిస్టర్ చేయాలని కోరడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన కాలంలో అధికారులు అన్యాయంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం జరుగుతుందని, ఇటువంటి వారు భవిషత్తులో జవాబు చెప్పకతప్పదని, మూల్యం చెల్లించక తప్పదని, వడ్డీతో సహా బదులు ఇవ్వాల్సి వస్తుందన్నారు.

# కోడుమూరు గ్రామపంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని సానిటరీ అధికారుల ఆదేశించిన ఎంపీడీవో








మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో సోమవారం రోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా కోడుమూరు గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలనీలో పర్యవేక్షణ చేయడం జరిగినది అదేవిధంగా సుందరయ్య నగర్ లో కూడా డ్రైనేజీస్ క్లీన్ చేయించే విషయంలో ప్రతికూల వార్తలకు స్పందించి ఏరియాను సందర్శించి సంబంధిత పారిశుద్య నిర్వహణ కార్మికులకు ఆదేశాలు ఇస్తూ సమస్య పరిష్కారం చేయవలసిందిగా కోరడమైనది మరియు సంత మార్కెట్ సమీపంలోని స్కూల్ దగ్గర డ్రైనేజ్ బ్లాక్ అయ్యి డ్రైనేజ్ వాటర్ రోడ్ మీదకు వస్తున్నాయి అనేటువంటి సమస్యను కూడా పరిష్కారం చేయమని సంబంధిత సిబ్బందితో క్లియర్ చేయాల్సిందిగా ఆదేశించడం అయినది. గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ కార్మికులు బాగా పనిచేసే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవలసిందిగా ఈ సందర్భంగా తెలియజేశారు సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు గ్రామపంచాయతీలో జరిగే ప్రతి పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో కార్మికులకు సలహాలు ఇస్తూ పర్యవేక్షణ విధి నిర్వహణలో భాగంగా చేయవలసిన సమయంలో పర్యవేక్షణ చేయవలసిందిగా ఈ సందర్భంగా వారు స్థానిక అధికారులు ఆదేశించారు

# కారుణ్య నియామకాల్లో శాశ్వతమైన ఉద్యోగాలు కల్పించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ మున్సిపాలిటీ ఉద్యోగులు సేవలో ఉండగానే ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కారుణ్య నియామకాలలో భాగంగా, రెండు కుటుంబాలకు శాశ్వత ఉద్యోగాలను కల్పించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఎప్పటికీ ఉద్యోగుల సేవలను మరువలేం. వారి కుటుంబ సభ్యులకు అండగా నిలవడం నా కర్తవ్యంగా భావిస్తున్నానను అని ఎమ్మెల్యే తెలిపారు.

# ప్రభుత్వం లేకపోయినా పెత్తనం వారిదే!!

- కమిషనర్ వైసీపీ నాయకులతో కుమ్మక్కయారా?
- అధికార టిడిపి నాయకులు లేకుండానే పనుల పరిశీలన.
- బడ్జెట్ లేకున్న సాధారణ నిధులు కేటాయించాలని నిర్ణయం.





మన గళండోన్ పట్టణంలోని పాతపేట లోని పెద్దమ్మ గుడి దగ్గర నుంచి స్మశానమునకు వెళ్ళు దారి పూర్తిగా పాడు అయిపోయినందున రోడ్డును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ నూతన రోడ్డు నిర్మాణమునకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మించుటకు 12 లక్షల రూపాయలు ఖర్చు అగునని వాటిని మున్సిపల్ సాధారణ నిధుల నుంచి బడ్జెట్ కేటాయించి నిర్మాణం చేపడుతామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ , కౌన్సిలర్ కటిక వేణు , మున్సిపల్ డి ఈ రఘు , మున్సిపల్ ఏఈ సురేష్ , నంద్యాల జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షుడు ప్రసాద్ , నంద్యాల జిల్లా కార్యదర్శి కురుకుంద హరి పట్టణ యూత్ అధ్యక్షుడు వంశీ గారు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బీఐ రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్ల తగ్గించవచ్చు

మనగళం, భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ఈ వారంలో నిర్వహించే ద్రవ్య విధాన కమిటీ(ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించాలని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక సూచించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా భారత వస్తువులపై 50 శాతం టారిఫ్ విధించిన నేపథ్యంలో ఇది ఆర్‌బీఐకి సరైన ఎంపికవుతుందని అభిప్రాయపడింది. సోమవారం మొదలయ్యే ఎంపీసీ సమావేశానికి సంబంధించి అక్టోబర్ 1న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నిర్ణయాలను వెల్లడిస్తారు. వినియోగదారు ధరల సూచీ(సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పట్టింది. అందువల్లే ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత ఆర్‌బీఐ ఇప్పటివరకు రెపో రేటును 1 శాతం మేర తగ్గించింది. ఆగస్టులో జరిగిన సమావేశంలో మాత్రమే యథాతథ స్థితిని ఎంచుకుంది. దేశీయ ఆర్థిక వ్యవస్థపై అమెరికా టారిఫ్, ఇతర భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావాన్ని అంచనా వేసేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం తక్కువగానే ఉంటుందనే అంచనాల నేపథ్యంలో ఆర్‌బీఐ మరో 25 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించడం సమంజసమేనని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. ప్రస్తుత వాతావరణం రేటును తగ్గించేందుకు సానుకూలంగా ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా పన్నులను తగ్గించడంతో ద్రవ్యోల్బణం 4 శాతం కంటే చాలా దిగువకు చేరుకుంటుంది. అయితే, ప్రాథమికంగా అంచనా వేయడం మాత్రమే కాదు, వృద్ధి స్థిరంగా 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని నమ్మకం ఉంది. కాబట్టి అమెరికా టారిఫ్ ప్రభావం తర్వాత కూడా ఈ మేర కీలక రేట్లలో తగ్గింపుతో ముప్పు ఉండకపోవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనామిస్ట్ మదన్ సబ్నవిస్ వెల్లడించారు.

# జీఎస్టీలో సవరణలు.. నిర్మాణ రంగానికి మేలు

మనగళం, సొంతింటి కలను సాకారం చేసుకోవాలని చాలా మందికి ఉంటుంది. నిర్మాణ ఖర్చుల కారణంగా ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తుంటారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ రేట్లను తగ్గించడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో సొంతింటిపై ఆశలు చిగురిస్తున్నాయి. ధరల తగ్గింపు కారణంగా నిర్మాణ రంగంలో డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగరవాసులకు సొంత ఇల్లు కట్టుకోవాలనే కల ఇప్పుడు కొంచెం సులువు కానుంది. త్వరలో గృహ నిర్మాణ రంగం మరింత వేగాన్నిపుంజుకోనుంది. నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, గ్రానైట్, మార్బుల్స్, టైల్స్, రంగులు వంటి పలు నిర్మాణ సామగ్రి ధరలపై కేంద్రం జీఎస్టీని తగ్గించింది. దీంతో డెవలపర్లకు ప్రాజెక్ట్ ఖర్చులను తగ్గించడంతోపాటు ఇళ్ల కొనుగోలుదారులకు కొంత ఊరటనిస్తుంది. జీఎస్టీ 2.0 కింద సిమెంట్, రెడీ-మిక్స్ కాంక్రీట్ పై 18 శాతం (గతంలో 28 శాతం) ఇటుకలు, టైల్స్, ఇసుకపై 5 శాతం (గతంలో 18 శాతం) పెయింట్స్, వార్నిష్ లపై 18 శాతం (గతంలో 28 శాతం) పన్ను వర్తిస్తుంది. సాధారణంగా ఇంటి నిర్మాణంలో అయ్యే ఖర్చులో 40 నుంచి 45 శాతం వ్యయం నిర్మాణ సామగ్రిదే ఉంటుంది. తాజా జీఎస్టీ సవరణతో నిర్మాణ సామగ్రిపై అయ్యే ఖర్చులో 10 నుంచి 15 శాతం వరకు ఆదా అవుతోంది. ఫలితంగా మొత్తం ఇంటి నిర్మాణ వ్యయం 4 నుంచి 6 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని రియల్ రంగ నిపుణులు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సవరించినప్పటికీ, ఇండ్లు, నిర్మాణ సామగ్రి ధరలు ఇప్పుడే తగ్గుతాయని ఆశించలేం. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మాణంలో ఉన్న అపార్ట్ మెంట్లు, విల్లాలు, వాణిజ్య భవనాల కోసం ఇప్పటికే మెటీరియల్ కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవచ్చు. ఇలాంటి ప్రాజెక్టులలో ధరలు తగ్గే అవకాశం తక్కువ. ఇలాంటి సందర్భాల్లో డెవలపర్లు ధరలను నేరుగా తగ్గించకుండా, పండుగ డిస్కౌంట్లు, ఫ్లెక్సిబుల్ పేమెంట్ ప్లాన్ లు లేదా కస్టమైజ్డ్ డీల్స్ అందించే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# సంపాదకీయం

నదీనదాలు.. ప్రజోపయోగ నిధులు

నదుల సంరక్షణపై పోరాడిన బ్రిటీష్ కొలంబియాకు చెందిన నదుల సంరక్షణ సంస్కర్త మార్క్ ఏంజిలో స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి ఏటా సెప్టెంబర్ 4వ ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుతున్నది. వందకు పైగా దేశాల్లో జరిగే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం నదులను కాలుష్యం నుండి కాపాడడం, వాతావరణంలో సంభవిస్తున్న అవాంఛనీయ మార్పులకు అడ్డుకట్టవేయడం. ఇప్పటికే దేశం లో నదీజలాల పంపిణీ విషయంలో అంతరాష్ట్ర వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో అనేక అవాంతరాలు ఏర్పడుతున్నాయి. అధిక వర్షాలతో అపారమైన జలసంపద కడలి పాలై నిరుపయోగంగా మారుతున్నది. నదుల కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల వలన అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. నదులు అంతర్ధానం కాకుండా, నదులను కాలుష్య రహితంగా మార్చి సాగునీటికి, తాగునీటికి లోటులేకుండా చేయాలి. విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక తవ్వకాలు, మితిమీరిన నీటి వినియోగం, కాలుష్యం వలన భవిష్యత్తులో నదులు అంతరించే అవకాశముంది. వీటితోపాటు అడవులను నరికి వేయడం, వర్షాభావం, పర్యావరణాన్ని పట్టించుకోకుండా నిర్మించే ఆనకట్టల వల్ల నదులు నిర్జీవంగా మారే ప్రమాదం పొంచి ఉంది. గంగా నదీ కాలుష్య ప్రక్షాళన దాదాపుగా విఫలమైనది. యమునా నది కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రపంచ మానవాళికి నదులు చేస్తున్న మహోపకారం మరువలేనిది. అపారమైన జలసంపదతో తులతూగే నదులను పరిరక్షించుకోవడం మన కనీస బాధ్యత. గతం వర్తమానంగా, వర్తమానం భవిష్యత్తుగా పరివర్తన చెందడం సహజ ప్రక్రియ. 'గతం గతః' అని, 'గతజలసేతు బంధనంబు..తగదు' అంటూ గత విషయాలను వదిలేస్తే వర్తమానం దుర్భరంగా, భవిష్యత్తు అంధకార బంధురంగా మారక తప్పదు. గతం వర్తమాన, భవిష్య కాలాలను శాసించే శిలాశాసనం. ఇప్పటి వరకు మనం నదుల విషయంలో, నదీ జలాల విషయంలో శ్రద్ధ చూపలేకపోయాం. గతంలో జరిగిన తప్పిదాలు ఇక ముందు పునరావృతం కారాదు. నదుల్లో నీరు వృథాగా పోవడం రాబోయే సంక్షోభానికి సూచనగా ఎంతోమంది జలవనరుల నిపుణులు దశాబ్దాల నుండి హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా పట్టించుకోని పాప ఫలితమే ప్రజలపాలిట శాపమై కూర్చుంది. ఇకనైనా నదీజలాల సక్రమ వినియోగం, నదుల సంరక్షణపై తగిన శ్రద్ధ వహించకపోతే రాబోయే కాలమంతా ప్రజలు తీవ్ర నీటిఇబ్బందులకు గురికాక తప్పదు. నదుల్లో కాలుష్యం అరికట్టకపోతే జలచరాలన్నీ అంతరించిపోగలవు. మానవవిజ్ఞానం ఎంత పెరిగినా, మనిషి హృదయం తరిగిపోయి, అత్యాశ పెరిగిపోయి తన పతనానికి తానే బాటలు వేసుకుంటున్నాడు. పచ్చదనం నశించింది, పర్యావరణం చెడింది. భూతాపం పెరిగింది. కాలుష్యం కట్టలు తెంచుకుని, వరద గోదారిలా జనజీవనాన్ని ముంచెత్తుతున్నది. నదులన్నీ తరిగిపోతున్నాయి. నదుల్లో కాలుష్యం తారస్థాయికి చేరింది. ఇంతటి విపత్తును మునుపెన్నడూ కనలేదు. మానవ మనుగడకు ఆధారమైన నదులను పరిరక్షించకపోతే భవిష్య పరిణామాలు ఊహాతీతంగా ఉంటాయి. నదులు ప్రకృతి ప్రసాదించిన వరం. నదులే నాగరికతకు చిహ్నాలు. నదీ తీరప్రాంతాల్లోనే జనజీవనం అధికం. ప్రపంచంలో ఎన్నో నదులున్నాయి. నైలు నది, మిసిసిపి, హెూయాంగ్ హెూ, అమెజాన్, కాంగో వంటి నదులు ప్రపంచంలో పేరొందిన నదులు. ఈజిప్టును నైలునదీ వరప్రసాదం అంటారు. ఈ నది ప్రక్కనే అనేక చారిత్రక కట్టడాలు వెలిసాయి. నదులు శక్తి వనరులు. సింధు నాగరికత, హరప్పా మెహంజదారో నాగరికత గురించి ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. నదీసంపద నిలకడగా ఉంటే ఏ దేశ అభివృద్ధి అయినా స్థిరంగా ఉంటుంది. అలాంటి నదీజలసంపద కడలిపాలవుతున్నది. భారత దేశంలో నదులకు కొరతలేదు. జీవనదులు, వర్షాధార నదులతో భారత ఉపఖండం ప్రకృతి మాత ఒడిలో పూదండ లా రాణిస్తున్నది. భారత దేశంలో ఎన్నో నదులు, ఉపనదులున్నాయి. నదీ వ్యవస్థకు భారతదేశం పుట్టినిల్లు. అందుకే భారత్ ను 'లాండ్ ఆఫ్ రివర్స్' గా పిలుస్తారు. నదీ తీరంలో అరణ్యాలు, జంతుసంపద ఏర్పడుతున్నాయి. తాగునీటికి, రవాణాకు, మత్స్య సంపదకు నదులే సోపానాలు. జలవిద్యుత్, సాగునీటికి నదులే ఆధారాలు. నదుల వలన కలిగే ప్రయోజనాలు అపారం. నదులు ప్రకృతి సంపదలో ఒకభాగం. ఎక్కడైతే నదులు, నీటి ప్రవాహాలు ఉంటాయో, అక్కడే మానవ ఆర్థిక వికాసం వెల్లివిరుస్తుంది. నదులు, నీటి వనరులు లేక పోతే మానవ జీవనం దుర్భరం. అలాంటి నదులను కాలుష్యంతో నింపేస్తున్నాం. నదీ పరీవాహక ప్రాంతాల్లో వెలసిన గ్రామాలు, నగరాల వలన కాలుష్య సమస్య తలెత్తింది. వినియోగించిన నీటిని నదుల్లోకి శుద్ధి చేయకుండా వదిలేయడం, వాడి పారేసిన ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాలను నదుల్లో వదలడం ఘోరం. దీనివలన నదీజలాలు కలుషితమైపోతున్నాయి. నదులనుండి సముద్రాల్లో కలిసే నీటి వలన సముద్ర జలాలు కలుషితం కావడం, సముద్ర జీవరాశులు చనిపోవడం, పర్యావరణ విధ్వంసం జరగడం భావ్యం కాదు. ఇలాంటి పరిస్థితులను నిలువరించి, నదులను పరిరక్షించాలనే ధ్యేయంతోనే ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ చివరి ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నదుల సంరక్షణపై అనేక కార్యక్రమాలు ఏర్పాటవుతున్నాయి. ప్రజల్లో నదులపట్ల, నీటిపట్ల చక్కని అవగాహన కోసం జరిగే ఒక ముఖ్యమైన సందర్భమే ప్రపంచ నదుల దినోత్సవం. నదులను పరిరక్షించి ప్రపంచ మానవాళి మనుగడను కాపాడాలన్న ధ్యేయంతో జరిగే ప్రపంచ నదుల దినోత్సవం రాబోయే ఉపద్రవానికి అడ్డుకట్ట వేయాలి. నదుల పరిరక్షణ విషయంలో అశ్రద్ధను వీడి బృహత్తర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలి. ఏదిఏమైనప్పటికీ ప్రపంచ దేశాలన్నీ నదుల సంరక్షణ విషయంలో సమష్టి బాధ్యత వహించాలి.

# ప్రపంచ గుండె దినోత్సవ ర్యాలీ ప్రారంభించిన ఎస్పీ సునీల్ షేరాన్

- ఇండస్ హార్ట్ ఆసుపత్రి, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో "గుండె రక్షణ కోసం నడక", ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహణ
- మితాహారం, క్రమం తప్పని వ్యాయామం, పొగాకు దూరంగా ఉండటం గుండెకు రక్షణ కల్పిస్తుంది: ఎస్పీ సునీల్







మనగళం, నంద్యాల సోమవారం ప్రపంచ గుండె దినోత్సవ సందర్భంగా ఇండస్ హార్ట్ ఆసుపత్రి, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో "గుండ రక్షణ కోసం నడక" ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని నడక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మితాహారం, తగినంత వ్యాయామం, పొగ తాగడం వంటి ఇతరులవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండెను పది కాలాలపాటు పదిలంగా రక్షించుకోవచ్చు అని అన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ ప్రజల అవగాహన కోసం ఐఎంఏ ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాధుల పట్ల తీసుకోవలసిన ముందు జాగ్రత్తల గురించి ర్యాలీలు,సదస్సులు ఆయా జబ్బుల ప్రత్యేక రోజులలో నిర్వహిస్తూ ఉన్నామన్నారు. ఇండస్ ఆసుపత్రి గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ జహంగీర్,డాక్టర్ మురళీకృష్ణ,గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కోటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థూలకాయం రాకుండా చూసుకోవడం ద్వారా, షుగరు బీపీ వంటి జబ్బులు ఉన్నవారు సరైన చికిత్స తీసుకుంటూ నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా, నిత్యం క్రమం తప్పకుండా నడక తదితర వ్యాయామాలు చేయడం ద్వారా, పొగాకు దూరంగా ఉండటం ద్వారా గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. ఛాతీ లో నొప్పి, ఒళ్లంతా చెమటలు పట్టడం,ఛాతీ నొప్పి భుజానికి, వెనుకకు, దవడకు పాకినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు అజాగ్రత్త చేయరాదన్నారు. ఎటువంటి శ్రమ, మెట్లు ఎక్కడం, ఎక్కువ దూరం నడవడం లాంటివి చేయకుండా వెంటనే ఈసీజీ తీసి ఇతర పరీక్షలు చేసి అది గుండె పోటా కాదా అని నిర్ధారణ చేసే ఆసుపత్రుల దగ్గరికి వెళ్లడం ఎంతో అవసరం అన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో మొదటి గంట చాలా కీలకమన్నారు. ఆ సమయంలో సరైన చికిత్స చేస్తే ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చు అన్నారు. ఒకసారి గుండెపోటు వచ్చిన వారు యాంజియోగ్రామ్ పరీక్ష చేయించుకుని గుండె రక్తనాళాలు మూసుకుపోయి ఉన్నాయా లేదా చూసుకుని అవసరం అయితే యాంజియో ప్లాస్టి, లేదా ఎక్కువ నాళాలు మూసుకుపోతే బైపాస్ ఆపరేషన్ చేయించుకోవలసి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవలో ఈ చికిత్సలను పొందుపరిచారని అన్నారు. ఇండస్ ఆసుపత్రి నుండి ప్రారంభమైన "గుండె రక్షణ కోసం నడక " ర్యాలీ సంజీవనగర్ గేట్ వరకు కొనసాగింది. పెద్ద ఎత్తున వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది గుండె రక్షణకు సంబంధించిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, టూ టౌన్ సిఐ అస్రార్ భాష, వన్ టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ హరినాథ రెడ్డి, డాక్టర్ విజయబాబు, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ షర్మిల, డాక్టర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ సుంకాలపై బ్రిక్స్ ఆందోళన




మన గళం : వాణిజ్య భాగస్వామ్య దేశాలకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. గాజాలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను కూడా అవి గర్హించాయి. బ్రిక్స్‌తో పాటు భారత్-బ్రెజిల్-దక్షిణాఫ్రికాతో కూడిన ఐబీఎస్ఏ ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఐబీఎస్ఏ తీవ్రంగా ఖండించింది. ఉక్రెయిన్ ఘర్షణను ప్రస్తావిస్తూ ఉద్రిక్తతలను నివారించాలని, శాంతిని స్థాపించాలని కోరాయి. అయితే బ్రిక్స్ తన తుది ప్రకటనలో ఉక్రెయిన్ ప్రస్తావన తీసుకురాకపోవడం గమనార్హం. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల విదేశాంగ మంత్రులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రసంగిస్తూ ప్రపంచంలో బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదని సభ్య దేశాలకు సూచించారు. నిర్మాణాత్మక మార్పుకు గొంతుకగా నిలవాలని కోరారు. ఏకపక్షవాదం, ఆర్థిక జాతీయతావాదం కారణంగా ఎదురయ్యే ప్రమాదాలపై హెచ్చరికలు చేశారు. 'పెరుగుతున్న రక్షణ వాదం, సుంకాల అస్థిరత, సుంకేతర అడ్డంకులు వాణిజ్యానికి అడ్డంకిగా మారుతున్నాయి. కాబట్టి బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థను బ్రిక్స్ దేశాలు పరిరక్షించాలి' అని జైశంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో తెలిపారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నందుకు పాతిక శాతం టారిఫ్‌ను విధించడం సహా మొత్తంగా భారత వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అల్లకల్లోలంగా ఉన్న ప్రపంచంలో శాంతి పరిరక్షణకు, చర్చలకు, దౌత్యానికి, అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉంటామని బ్రిక్స్ సందేశం ఇవ్వాలని జైశంకర్ సూచించారు.

# ఏథెన్స్‌లో కమ్యూనిస్టు పార్టీ ఫెస్టివల్‌కు భారీ స్పందన



మన గళం : గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన ఫెస్టివల్‌కు భారీ స్పందన వచ్చింది. ఏథెన్స్‌లోని ట్రిట్సిస్ పార్కులో నాలుగు రోజులపాటు జరిగిన 51వ గ్రీస్ ఒడిగిటిస్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. దీనిలో వేలాదిమంది యువకులు , కార్మికులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రధాన నినాదం " చిన్న నిప్పు రవ్వ పెద్ద అగ్ని జ్వాలగా మారుతుంది " యువతను ఆకట్టుకుంది. ఆ ప్రాంతమంతా సోషలిజంకు సంబంధించిన బ్యానర్లు, నినాదాలతో నిండిపోయింది. కచేరీ వేదికలు, చర్చలు, ప్రదర్శనలు, సంస్కృతిని రాజకీయాలతో, కళను పోరాటంతో కలిపాయి. ఈ ఫెస్టివల్‌కు ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలకు చెందిన యువ కమ్యూనిస్ట్, సామ్రాజ్యవాద వ్యతిరేక సంస్థలు హాజరయ్యాయి. ఉక్రెయిన్ , రష్యా, పాలస్తీనా, ఇజ్రాయెల్, టర్కీ, సైప్రస్‌లకు చెందిన యువకులు తమకు హద్దులు తెలియదని చాటిచెప్పారు. క్యూబా, పాలస్తీనా రాయబారులు, అంతర్జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులు, కమ్యూనిస్ట్ మేయర్లు, సాంస్కృతిక వ్యక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటి కార్యదర్శి థోడోరిస్ కొట్సాంటిస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరాటాల్లో యువత బలాన్ని నొక్కిచెప్పారు. ఈ ఫెస్టివల్ చరిత్రలో కొత్త పేజీలు రాస్తుందన్నారు. గ్రీస్ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక బిల్లును ఖండించారు. 13 గంటల బానిసత్వానికి కార్మికులు సిద్ధంగాలేరని , 21వ శతాబ్దంలో రోజుకు 7 గంటలు, వారానికి 5 రోజులు, 35 గంటలు, జీతాల పెంపునకు పార్టీ పోరాడుతుందన్నారు. ఇజ్రాయిల్‌కు గ్రీక్ ప్రభుత్వ సహకారాన్ని ఖండిస్తూ, తూర్పు జెరూసలేంను రాజధానిగా కలిగిన 1967 సరిహద్దుల్లో పాలస్తీనా దేశాన్ని వెంటనే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఫెస్టివల్ వేదిక నుంచి అక్టోబర్ 1న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పరిశ్రమలను మూసేయాలని, ఆధునిక బానిసత్వానికి వ్యతిరేకంగా తమ గొంతులను వినిపించాలని కోరారు.



## రామ్ చరణ్ టాలెంట్‌ను సరిగ్గా వాడుకోలేదు అదే నా బాధ..

మన గళం, మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌పై ప్రజెంట్ రామ్ చరణ్ ఫ్యాన్స్ పలువురు సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ చేస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తమన్ 'గేమ్ చేంజర్' పాటలకు హుక్ స్టెప్పులు లేవంటూ అసంతృప్తి వ్యక్తం చేయగా..ఆ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఆయన చేసిన కామెంట్స్‌ను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారంటూ రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు తమన్. 'రామ్ చరణ్ పెద్ద డ్యాన్సర్. తొలి సినిమాతో మొదలు 'నాయక్‌లోని లైలా ఓ లైలా', బ్రూస్‌లీ లోని మెగా మెగా మీటర్ లాంటి ఎన్నో పాటలకు అద్భుతమైన స్టెప్పులేసి ఫ్యాన్స్‌ను ఆకట్టుకున్నారు చర్రీ. అలాంటి ఆయన ఎనర్జీకి కొరియోగ్రాఫర్లు సరైన మూమెంట్స్ ఇవ్వలేకపోయారని ఇటీవల అన్నాను. ఆ కామెంట్స్‌ను కొందరూ హీరోని టార్గెట్ చేసి మాట్లాడానని తప్పుగా అర్థం చేసుకున్నారు. 'గేమ్ చేంజర్' విషయంలో రామ్ చరణ్ డ్యాన్స్ టాలెంట్‌ను సరిగ్గా వాడుకోలేకపోయాన్నదే నా బాధ.. అంతే కానీ వేరే ఉద్దేశ్యంతో నేను అనలేదు. రామ్ చరణ్ చాలా మంచి వ్యక్తి. అందుకే ఆయన్ని నేను మెగా హార్ట్ స్టార్ అని పిలుస్తాను. ఓజీ మ్యూజిక్ గురించి కూడా రామ్ చరణ్ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు' అంటూ తెలిపాడు తమన్.

## థామ నుంచి ఫస్ట్ సింగిల్ ప్రమో రిలీజ్..

మన గళం, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న లేటెస్ట్ క్రేజీయస్ట్ ప్రాజెక్ట్ 'థామ'. మాడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో నాల్గవ భాగంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నాడు.దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్న 'థామ' నుంచి రీసెంట్‌గా వచ్చిన టీజర్‌కు సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ రాగా.. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'తుమ్మెరేనహుయే' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను రిలీజ్ చేశారు. ఇందులో రష్మిక లుక్ అండ్ డ్యాన్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. తుమ్మెరేనహుయే సింగిల్ ఫుల్ సాంగ్ రేపు (సెప్టెంబర్ 29)న రాబోతున్నట్లు తెలుపుతూ.. 'లవ్ అండ్ హార్ట్ బ్రేక్ తర్వాత ప్రతీ అమ్మాయి యొక్క వాయిస్ సాక్షిగా చూడండి' అనే క్యాప్షన్ ఇచ్చారు. ప్రజెంట్ ఈ సాంగ్ ప్రోమో రష్మిక ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది.





కాగా.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న ఈ మూవీ దీపావళి స్పెషల్‌గా ఆడియన్స్ ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది.

# విలన్ పాత్రలో టాలీవుడ్ హీరోయిన్..

మన గళం, టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లు ఉన్న సంగతి తెలిసిందే. కానీ కొంతమంది హీరోయిన్లు ఒకటి లేదా రెండు సినిమాలతోనే పాపులర్ అవుతూ ఉంటారు. అలాంటి వారిలో మీనాక్షి చౌదరి ఒకరు. ఈ పొడుగు కాళ్ళ సుందరి... హర్యానా నుంచి వచ్చి మన టాలీవుడ్ ఇండస్ట్రీలో సెటిల్ అయ్యారు. ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులు ముందుకు వచ్చిన ఈ బ్యూటీ... గుంటూరు కారం, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం లాంటి బంపర్ హిట్ సినిమాలు అందుకున్నారు. దీంతో తెలుగులో మరిన్ని అవకాశాలు ఆమెకు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో బాలీవుడ్ ఇండస్ట్రీ వైపు కూడా ఆమె వెళ్తున్నారు. ప్రస్తుతం ఫోర్స్ 3 సినిమాలో మీనాక్షి చౌదరి ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారట. అయితే ఈ సినిమా తర్వాత... మరో సినిమాతో బాలీవుడ్ ఇండస్ట్రీని ఏలేందుకు మీనాక్షి చౌదరి సిద్ధమైనట్లు చెబుతున్నారు. బాలీవుడ్ లో తన సెకండ్ సినిమాలో విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందట. ఈ మేరకు ఆమెతో చర్చలు జరుగుతున్నాయట. ఆ నెగిటివ్ పాత్ర చేస్తే.. మీనాక్షి చౌదరి కెరీర్ ఓ రేంజ్ కు వెళుతుందట. ఈ సినిమాపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట.



## కామెడీ చేయడం ఎంత కష్టమో నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది:



మన గళం, కోలీవుడ్ యంగ్ బ్యూటీ కయాదు లోహర్ ఇటీవల 'డ్రాగన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళంలో వరుస ప్రాజెక్ట్స్ సొంతం చేసుకుంటూ క్రేజీ బ్యూటీగా మారిపోయింది. త్వరలో ఈ అమ్మడు టాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయం కాబోతుంది. విశ్వక్ సేన్, అనుదీప్ కాంబోలో రాబోతున్న 'ఫంకీ' చిత్రంలో నటిస్తోంది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కయాదు లోహర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ''ప్రజెంట్ నేను అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను.ఈ మూవీ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుంది. అయితే ఈ సినిమా డైలాగ్స్ అన్ని షూటింగ్ స్పాట్‌లో ఆలోచించి రాసినవే. ప్రతి ఐదు నిమిషాలకు వచ్చే సీన్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. కామెడీ చేయడం ఎంత కష్టమో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. దానికి భాష కూడా ముఖ్యమే. భాష తెలిసినప్పుడే దాని అర్థమెంటో తెలుస్తుంది. కామెడీ కూడా సహజంగానే వస్తుంది. నాకు నవ్వించే స్వభావం ఉందని నమ్ముతా. కానీ కామెడీ చేయాల్సి వస్తే మాత్రం అది చాలా కష్టమైన పనిగా భావిస్తా. చూసేటప్పుడు తేలికగా ఉన్నా.. షూటింగ్ సమయంలో చాలా కష్టంగా అనిపిస్తుంది. ప్రతీ పంచ్ సరిగ్గా వేయాలి.. ప్రతీ టేక్‌ను సరిగ్గా వచ్చేలా చూసుకోవాలి. అనుదీప్ గారు స్క్రిప్ట్‌పై ఆధారపడకుండానే చాలా డైలాగ్స్ రాస్తుంటారు. నాకు ఒక డైలాగ్ ఉందంటే.. మళ్లీ ఐదు నిమిషాల తర్వాత ఓ డైలాగ్ వస్తుంటుంది. నా భాష అస్సామీలో చేస్తే అంత కష్టంగా అనిపించదు.. కానీ వేరే భాషలో చేయాలంటే చాలా కష్టం" అని చెప్పుకొచ్చింది. ఇక ఈ అమ్మడు 'ఫంకీ' గురించే చెప్పిందని అంతా చర్చించుకుంటున్నారు. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగిపోయింది.

## ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా

మన గళం, సక్సెస్‌ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె - ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా ర్యాంప్ మీట్ ప్రెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్



జైన్స్ నాని మాట్లాడుతూ "ఈ సినిమా ఫుల్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. నువ్వు ఎంత బాగా స్క్రిప్ట్‌లో రాస్తే అంత బాగా నటిస్తానని కిరణ్ అన్న ప్రోత్సహించేవారు. హీరోయిన్ క్యారెక్టర్ కూడా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. కె ర్యాంప్ అంటే కిరణ్ అబ్బవరం ర్యాంప్. అది దృష్టిలో పెట్టుకునే కథ రాశాను, సినిమా రూపొందించాను. థియేటర్స్‌లో సినిమా చూస్తున్నప్పుడు కూడా కిరణ్ అబ్బవరం ర్యాంప్ అనే అనుకుంటారు"అని అన్నారు. ప్రొడ్యూసర్ రాజేష్ దండా మాట్లాడుతూ "కె ర్యాంప్ కథను నా దగ్గరకు కిరణ్ పంపించారు. కథ విన్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. %ూశ్రీంశీ =ఝ౦% - తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల మా సంస్థలో మరో ఎంటర్‌టైనర్ అని ఫిక్స్ అయ్యా. జైన్స్ నానితో ఇండస్ట్రీకి మరో త్రివిక్రమ్, హరీశ్ శంకర్ దొరికినట్లే. డైలాగ్స్ అంత బాగా రాసుకున్నారు నాని. ఈ దీపావళికి పోటీ ఎంత ఉన్నా మా మూవీ సక్సెస్ మీద పూర్తి నమ్మకంగా ఉన్నాం"అని తెలిపారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఈ దీపావళికి థియేటర్స్‌కు వచ్చే అన్ని వర్గాల ప్రేక్షకులను కె ర్యాంప్ ఎంటర్‌టైన్ చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇది. హీరోయిన్ యుక్తికి హీరోతో సమాన ప్రాధాన్యత ఉన్న క్యారెక్టర్ ఉంది. తన నటన అందరినీ ఆకట్టుకుంటుంది.

## రామ్‌చరణ్‌కి సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చిన 'పెద్ది' టీమ్

మన గళం, గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ తెలుగు సినిమాలోకి హీరోగా అడుగుపెట్టి 18 సంవత్సరాలు పూర్తయింది. మెగాస్టార్ చిరంజీవి కుమారుడిగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన చరణ్ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చి 'చిరుత' సినిమాతో వెండితెరకు పరిచయం అయ్యాడు. అప్పటి నుంచి సక్సెస్‌ఫుల్ హీరోగా ఎదిగారు. అయితే 18 సంవత్సరాలు పూర్తి




చేసుకున్న సందర్భంగా 'పెద్ది' చిత్ర యూనిట్ రామ్ చరణ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. %ూశ్రీంశీ =ఝ౦% - తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల ఈ సందర్భంగా ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో చరణ్ రైలు పట్టాలు దాటుతూ కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. "మా పెద్ది ఇండస్ట్రీలోకి వచ్చి 18 ఏళ్లు పూర్తి కావడం మాకు ఎంతో సంతోషం. తెరపైన ఘనమైన వారసత్వం కొనసాగిస్తూనే.. బయట ఎంతో వినయ విధేయతతో ఉంటారు. తనకంటే ఓ ప్రత్యేకమైన పంథాను ఏర్పరుచుకున్నారు. మాకంతో ఉత్సాహాన్ని కలిగించి సందర్భాలు చాలా ఉన్నాయి. పెద్ది నుంచి చాలా సర్‌ప్రైజ్‌లు వస్తాయి" అని పెద్ది చిత్ర యూనిట్ పేర్కొంది. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో స్పోర్ట్స్ డ్రామాగా పెద్దిని దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు ఎఆర్ రహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 2026 మార్చి 27 ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది

# పాక్ పేసర్‌పై వసీమ్ అక్రమ్ విమర్శలు

మన గళం, ఆసియా కప్ సూపర్4లో టీమ్ఇండియాతో పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా మైదానంలో అనుచిత ప్రవర్తనతో హారిస్ రవూఫ్ వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ఆసియా కప్ ఫైనల్‌లోనూ అతడి పేరు మరోసారి ప్రముఖంగా వినిపించింది. అయితే ఈసారి అతడి పేలవ ప్రదర్శనే అందుకు కారణం. టీమ్ఇండియాతో జరిగిన తుదిపోరులో ఈ పాక్ బౌలర్ కేవలం 3.5 ఓవరల్లోనే ఏకంగా 50 పరుగులు సమర్పించుకున్నాడు. కనీసం ఒక్క వికెట్ కూడా తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వసీమ్ అక్రమ్.. హారిస్ రవూఫ్‌ను కడిగి పారేశాడు. కీలకమైన పోరులో భారీగా పరుగులు సమర్పించుకున్నాడని విమర్శించాడు. టీమ్ఇండియాతో మ్యాచుల్లో అతడి పేలవ ప్రదర్శనలకు బ్రేక్ పడటం లేదన్నాడు. ‘దురదృష్టవశాత్తూ హారిస్ రవూఫ్ బౌలర్‌గా రన్‌మెషీన్. ముఖ్యంగా అతడు టీమ్ఇండియా అనగానే భారీగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. నేను ఒక్కడినే అతన్ని విమర్శించడం లేదు. దేశం (పాకిస్థాన్) మొత్తం అతన్ని విమర్శిస్తోంది. అతడు రెడ్‌బాల్ క్రికెట్ ఆడటం లేదు. ఆటలోనూ మెరుగుపడటం లేదు. రెడ్ బాల్ క్రికెట్ ఆడనప్పుడు జట్టులో సభ్యుడిగా ఉండకూడదు. కనీసం నాలుగు లేదా అయిదు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లైనా ఆడాలి’ అని వసీమ్ అక్రమ్.. హారిస్ రవూఫ్‌నకు తలంటాడు. రవూఫ్.. రెడ్ బాల్ క్రికెట్ ఆడకపోవడం వల్లే రాణించలేకపోతున్నాడన్న వ్యాఖ్యలతో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ వకార్ యూనిస్ సైతం ఏకీభవించాడు. అలాగే పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా కెప్టెన్సీ కూడా సరిగా లేదని వసీమ్ అక్రమ్ చురకలంటించాడు. అతడి నిర్ణయాలూ కూడా ఓటమికి కారణమని విశ్లేషించాడు. అలాగే అతడు పీసీబీకి కూడా ఈ విషయమై పలు సూచనలు చేశాడు. ‘రెడ్ బాల్ క్రికెట్ ఆడకపోవడం వల్ల రవూఫ్‌కు బంతిమీద నియంత్రణ ఉండటం లేదు. పీసీబీ ఈ విషయంలో పునరాలోచించాలి. రెడ్ బాల్



క్రికెట్ ఆడకుంటే అలాంటి ఆటగాడికి కృతజ్ఞతలు తెలిపి సాగనంపాలి’ అని వసీమ్ అక్రమ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. ఆసియా కప్ 2025 ఫైనల్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబె.. హారిస్ రవూఫ్ బౌలింగ్‌లో ప్రతిదాడికి దిగారు. 15వ ఓవర్లో 17 పరుగులు చేశారు. ఈ ఓవర్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దీంతో 36 బంతుల్లో 64 పరుగులు అవసరమైన స్థితి నుంచి టీమ్ఇండియా 30 బంతుల్లో 47 రన్స్ అవసరమయ్యే స్థితికి చేరుకుంది. అలాగే 18వ ఓవర్లో రవూఫ్ మరో 13 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక ఆఖరి ఓవర్లో 10 పరుగులు అవసరమైన వేళ.. రవూఫ్ బౌలింగ్‌లోనే తిలక్ వర్మ సిక్స్, రింకు సింగ్ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించారు.

## ఏసీసీ చీఫ్ వింత ప్రవర్తన..
## కప్ ఇవ్వకుండా తీసుకెళ్లిన మొహ్సిన్ నఖ్వీ



మన గళం, ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ లో భారత జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. మ్యాచ్ అనంతరం ప్రెజెంటేషన్ సెర్మనీ సమయంలో వింత సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ గా పాకిస్తాన్ కు చెందిన మొహ్సిన్ నఖ్వీ ఉండటంతో భారత జట్టు ఆసియా కప్ ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించింది. అయితే భారత బౌలింగ్ కోచ్ అయిన మోర్నీ మోర్కెల్ ఈ ట్రోఫిని తీసుకొని భారత జట్టుకు ఇవ్వాల్సి ఉండగా.. ఎసిసి చీఫ్ మొహ్సిన్ నఖ్వీ ప్రవర్తన అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అతను భారత జట్టు ట్రోఫీని తీసుకోవడానికి నిరాకరించింది అని ప్రకటించగానే.. తన సొంత హెూటల్ గదిలోకి ఆసియా కప్ ట్రోఫితో పాటు ప్లేయర్లకు ఇవ్వాల్సిన ఇతర పతకాలను తీసుకెళ్లాడు. దీంతో అంతా ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.ఎసిసి చీఫ్ వింత ప్రవర్తనపై స్పందించిన బీసీసీఐ నవంబర్‌లో జరిగే తదుపరి ఐసీసీ సమావేశంలో బీసీసీఐ “చాలా తీవ్ర నిరసన” వ్యక్తం చేసేందుకు సిద్ధం అయినట్లు తెలిపింది. ఇదే ఘటనపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ, “భారతదేశం ఒక దేశం తో యుద్ధం చేస్తోంది. ఆ దేశానికి చెందిన నాయకుడు మాకు ట్రోఫీని అప్పగించాల్సి ఉంది. మన దేశంపై యుద్ధం చేస్తున్న దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి నుండి మేము ఆసియా ట్రోఫీ ని అంగీకరించలేము. కాబట్టి మేము ఆ ట్రోఫీని తీసుకోవడానికి నిరాకరించాము. కానీ ఆ పెద్దమనిషి మన దేశానికి ఇవ్వాల్సిన ట్రోఫీని, పతకాలను తన సొంత హెూటల్ గదికి తీసుకువెళతాడని దీని అర్థం కాదు. అది పూర్తిగా ఊహించనిది. అతను వీలైనంత త్వరగా ట్రోఫీని భారతదేశానికి తిరిగి పంపుతాడు. ఇది కొంత నైతికతను పునరుద్ధరిస్తుంది. నేటి బహుమతి పంపిణీ కార్యక్రమంలో పెద్దమనిషి ప్రవర్తనకు వ్యతిరేకంగా మేము చాలా బలమైన నిరసనను తెలియజేయబో తున్నాము” అని దేవజిత్ సైకియా మీడియాతో చెప్పుకొచ్చారు.

## పాకిస్తాన్ పై విజయం..
## కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కీలక నిర్ణయం




మన గళం, ఆసియా కప్ 2025లో భాగంగా నిన్న రాత్రి దుబాయ్ వేదికగా ఫైనల్ మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచులో భారత జట్టు పాకిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి 9వ సారి ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత దాదాపు గంటకు పైగా తర్వాత ప్రెజెంటేషన్ సెర్మనీ ప్రారంభమైంది. భారత జట్టు ట్రోఫీ తీసుకోదని ముందు నుంచే వార్తలు వచ్చాయి. పాక్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీనే ఆసియన్ క్రికెట్ కౌన్సిల్‌కు ప్రెసిడెంట్‌గా ఉండటమే అందుకు కారణం. ఆయన చేతుల మీద ట్రోఫీ అందుకోవడానికి భారత జట్టు ముందుకు రాలేదు. దీంతో ‘ఈ రోజు రాత్రి టీమిండియా తమ అవార్డులను తీసుకోవడం లేదని ఏసీసీ నుంచి నాకు సమాచారం అందింది. కాబట్టి, అవార్డు ప్రెజెంటేషన్ ముగిసింది.’అని ప్రెజెంటర్ సిమోన్ డౌల్ తెలిపారు. ట్రోఫీ లేకుండానే భారత ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. ఇదిలా ఉంటే అంతా ముగిసాకా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో కీలక ట్వీట్ చేశాడు. ఆసియా కప్ టోర్నమెంట్ ఆడినందుకు తనకు ఇచ్చే తన మ్యాచ్ ఫీజులను పహల్గామ్ ఉగ్రవాద దాడిలో బాధితులైన మన సాయుధ దళాలకు, బాధితుల కుటుంబాలకు మద్దతు తెలిపేందుకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించాడు.

# పాకిస్థాన్‌కు బుమ్రా అదిరిపోయే కౌంటర్...
# రవూఫ్ వికెట్ తీసి మరీ



మన గళం, ఆసియా కప్ 2025 టోర్నమెంట్ లో భాగంగా ఇవాళ టీమ్ ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మధ్య ఫైనల్ జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్లో టీమిండియా అద్భుతంగా బౌలింగ్ చేసి..పాకిస్తాన్ బ్యాటర్లను కట్టడి చేసింది. భారీ స్కోర్ చేస్తుందనుకున్న పాకిస్తాన్ ను... 146 పరుగుల కి కట్టడి చేసింది టీమిండియా. 19.1 ఓవర్లు ఆడిన పాకిస్తాన్... 146 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అయితే ఈ మ్యాచ్ లో రెండు వికెట్లు తీసిన బుమ్రా... హరీస్ రవూఫ్ ను పెవీలియన్ కు పంపించాడు. అద్భుతమైన యార్కర్ వేసి హరీస్ రవూఫ్ వికెట్ తీశాడు బుమ్రా. అయితే వికెట్ తీసిన తర్వాత పాకిస్తాన్ జెట్స్ కింద పడిపోయాయి.. అన్నట్లుగా సైగలు చేసి బుమ్రా అందరికీ షాక్ ఇచ్చాడు. దీంతో సైలెంట్ గా రవూఫ్ వెళ్లిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. సూపర్ ఫోర్ మ్యాచ్ లో ఇండియా జెట్స్ పై రవూఫ్ కూడా వెకిలీగా వ్యవహరించాడు. అందుకే బుమ్రా కౌంటర్ ఇచ్చాడు. ఇది ఇలా ఉండగా.. 147 పరుగలు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన టీమిండియా కూడా బ్యాటింగ్ లో తడబడుతోంది. ఈ మ్యాచ్ లో ఇప్పటికే 3 వికెట్లు కోల్పోయిన టీమిండియా పోరాడుతోంది. 20 పరుగులకే సూర్య, అభిషేక్ , గిల్ వికెట్లు కోల్పోయింది టీమిండియా.

## భారత్‌తో మ్యాచ్ అంటే ఒత్తిడి ఉంటుంది




మన గళం, భారత్‌తో ఆసియాకప్ 2025 ఫైనల్‌కు ముందు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత్‌తో మ్యాచ్ అంటే కచ్చితంగా ఒత్తిడి ఉంటుందని చెప్పుకొచ్చాడు.అయితే గతంలో తాము పొరపాట్లు చేయడం వల్లే మ్యాచ్ ఓడిపోయామని.. ఈసారి అవి జరక్కుండా చూసుకుంటామని పేర్కొన్నాడు. షేక్ హ్యాండ్ వివాదం సహా ఇతర విషయాలపై కూడా అతడు స్పందించాడు. ‘2007 నుంచి నేను క్రికెట్ ఆడుతున్నారు. మ్యాచ్ ఆడే రెండు జట్లు షేక్ హ్యాండ్ చేసుకోకపోవడం ఎప్పుడూ చూడలేదు. గతంలో ఒక్కోసారి భారత్, పాక్ మధ్య ఇప్పటి కంటే దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. కానీ అప్పుడు కూడా ఇరు జట్ల ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులు క్రికెట్‌కు మంచివి కావు’. ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియా ఫొటో షూట్‌కు దూరంగా ఉంది. దీనిపై కూడా సల్మాన్ అలీ అఘా మాట్లాడాడు. ‘వారు (భారత్) ఏం చేసినా చేయనివ్వండని, తాము మాత్రం ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రొటోకాల్‌ను పాటిస్తాం. ఫొటో షూట్‌లో పాల్గొనడం, పాల్గొనకపోవడం వారి ఇష్టం’ అని వ్యాఖ్యానించాడు. ‘నిజానికి ఆసియాకప్‌లో భారత్‌తో జరిగిన రెండు మ్యాచ్‌లలో మేం తప్పులు ఎక్కువగా చేశాం. అందుకే ఓడిపోయాం. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటేనే తీవ్ర ఒత్తిడి ఉంటుంది. ఒత్తిడి లేదని చెబితే అది అబద్ధమే అవుతుంది. మేం ఎక్కువ తప్పిదాలు చేయడంతోనే భారత్‌పై విజయం సాధించలేకపోయాం. ఫైనల్లో తప్పులు చేయకుండా.. భారత్‌పై గెలిచేందుకు ప్రయత్నిస్తాం. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని మెరుగైన ప్రదర్శన చేస్తాం’ అని సల్మాన్ అలీ అఘా ప్రెస్‌మీట్‌లో అన్నాడు. ‘దూకుడుగా ఉండే విషయంలో ఆటగాళ్లకు పరిమితులు విధించబోం. వారికి పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. ప్రతి ఆటగాడికి కూడా తమదైన శైలి ఉంటుంది. ఒక ఆటగాడు మైదానంలో దూకుడుగా ఉండాలనుకుంటే.. వారిని ఆపకూడదు. ఫాస్ట్ బౌలర్ ఆవేశాన్ని ఆపేస్తే.. వారికి ఇంకేం మిగులుతుంది’ అని హారిస్ రవూఫ్ ఎపిసోడ్‌ను ఉద్దేశించి మాట్లాడాడు.

## ఆసియా కప్ ట్రోఫీని తిరస్కరించిన టీమిండియా



మన గళం, ఆసియా కప్ విజేతగా టీమిండియా నిలిచింది. ఫైనల్‌లో పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. చివరి వరకూ ఉత్కంఠభరితంగా సాగిన టైటిల్ పోరులో భారత్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ చేజింగ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి భారత్‌కు విజయాన్ని కట్టబెట్టాడు. దీంతో టీమిండియా 9వ సారి ఆసియా కప్ విజేతగా నిలిచింది. మ్యాచ్ అనంతరం అవార్డు ప్రెజెంటేషన్ నాటకీయంగా సాగింది. ఆసియా కప్ ట్రోఫీ తీసుకోవడానికి టీమిండియా నిరాకరించింది. మ్యాచ్ ముగిసిన తర్వాత దాదాపు గంటకుపైగా తర్వాత ప్రెజెంటేషన్ సెర్మనీ ప్రారంభమైంది. భారత జట్టు ట్రోఫీ తీసుకోదని ముందు నుంచే వార్తలు వచ్చాయి. పాక్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీనే ఆసియన్ క్రికెట్ కౌన్సిల్‌కు ప్రెసిడెంట్‌గా ఉండటమే అందుకు కారణం. ఆయన చేతుల మీద ట్రోఫీ అందుకోవడానికి భారత జట్టు ముందుకు రాలేదు. ‘ఈ రోజు రాత్రి టీమిండియా తమ అవార్డులను తీసుకోవడం లేదని ఏసీసీ నుంచి నాకు సమాచారం అందింది. కాబట్టి, అవార్డు ప్రెజెంటేషన్ ముగిసింది.’అని ప్రెజెంటర్ సిమోన్ డౌల్ తెలిపారు. ట్రోఫీ లేకుండానే భారత ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఆడొద్దని డిమాండ్ వ్యక్తమైన విషయం తెలిసిందే. అయితే, ఐసీసీ, ఏసీసీ నిబంధలను గౌరవించి భారత జట్టు టోర్నీలో పాల్గొంది. పాక్‌తో మ్యాచ్‌ల్లో ఆడమా?గెలిచామా? అన్నట్టే టీమిండియా ప్లేయర్లు వ్యవహరించారు. ఆ జట్టుతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పాక్ ప్లేయర్లకు భారత ఆటగాళ్లు షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు. టాస్ సమయంలో, మ్యాచ్ ముగిసిన తర్వాత కరచాలనం చేయలేదు. షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశమైందో తెలిసిందే. ఈ చర్యతో భారత జట్టు పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు మద్దతుగా ఉంటామనే సందేశాన్ని ఇచ్చింది. ఇప్పుడు మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా భారత జట్టు ట్రోఫీని కూడా తీసుకోలేదు.

# కూటమి ప్రభుత్వ పాలన... అద్భుతం

- మంచి ఆలోచన నాయకులు కూటమిగా ఏర్పడితే అభివృద్ధి పరుగులు
- గత వైసీపీ ప్రభుత్వ నియంత పాలనతో రాష్ట్రాన్నిఇరవై ఏళ్లు వెనక్కి నెట్టాయి
- ప్రధాని మోడీ సహకారంతో ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు
- అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తా - విద్యాభివృద్ధి తనవంతు పాటుపడుతా
- ఏపీఇడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర





(మనగళం, ప్రతినిధి) : కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉందని, రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్(ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. ప్రధాని మోడీ సహకారంతో సీఎం చంద్రబాబు ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. విజయవాడ కుంచనపల్లిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా డైరెక్టర్ల ప్రమాణస్వీకారం సాగింది. ఏపీఇడబ్ల్యూఐడీసీ) డైరెక్టర్ గా నగరూరు రాఘవేంద్రం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ప్రసంగించారు. ముందుగా తనను తాను సభకు పరిచయం చేసుకున్న నగరూరు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్ రాజశేఖర్ తోపాటు డైరెక్టర్లు, కూటమి పెద్దలకు అభినందనలు తెలిపారు. అనంతరం భారత్ మాతాకి జై...నరేంద్రమోడీ... నాయకత్వం, జేపీ లడ్డా.. మాధవ్ నాయకత్వం వర్ధిల్లాంటూ నినదించారు. అదేవిధంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారాలోకేష్ నాయకత్వం వర్ధిల్లాంటూ నినాదం చేశారు. అనంతరం తనతాను పరిచయం చేసుకున్న నగరూరు రాఘేంద్ర మాట్లాడుతూ బీజేపీ నాయకుడిగా 2023 లో ఎమ్మెల్సీగా పోటీ చేశానని గుర్తు చేశారు. అప్పుడు వైసీపీ పాలనలో రాష్ట్ర పరిస్థితి ధారుణంగా ఉందన్నారు. కూటమి వచ్చాక గత ప్రభుత్వ తీరుతో పోలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. గత పలికామిని వైసీపీ నియంతపాలన మూలంగా రాష్ట్రాన్ని ఇవరై ఏళ్లు వెనక్కు నెట్టబడిందని ధ్వజమెత్తారు. చక్రవర్తి, ఔరంగజేబు పాలనను గత ప్రభుత్వం చేసిందని విమర్శించారు. వ్యవస్థలను నాశనం చేసందన్నారు. ఓ నియంత పాలన సాగిందని, గౌరవం అంటే అర్థం తెలియని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదని ధ్వజమెత్తారు. రాక్షసులు... దేవతల అమృతం కోసం పోటీ పడిన విధంగా.... రాక్షసులను ఓడించి కూటమి నేతలు అధికారం చేపట్టారని, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. మంచి ఆలోచనలు ఉన్న నాయకులు కూటమిగా ఏర్పడితే ఎలా ఉంటుందనేది సీఎం చంద్రబాబు పాలన ప్రత్యక్ష సాక్ష్యమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పరుగులు పెడుతోందని, రోడ్లు వేసిన తీరు ఇందుకు ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు తన శక్తినంతా ఉపయోగిస్తున్నారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అంకితభావం మూలంగా ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయని అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు పాలనలో పోలవరం ప్రాజెక్ట్ పూర్తవుతుందని నగరూరు రాఘవేంద్ర పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాజధానిని లేకుండా చేశాయని, ప్రస్తుతం పనులు చకచకా సాగతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం లేకుంటూ రాష్ట్రం దారుణంగా ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. నియంత పాలన మూలంగా అన్ని విధాలుగా వెనుకపడి పోయామని, ప్రస్తుత కూటమి పాలన మూలంగా అభివృద్ధి సాగుతోందన్నారు. గత పాలకులు ఏదైనా మాట్లాడితే చంద్రబాబు సీఎం అయితే వర్షాలు రావంటుంటారు... మరి ఇప్పుడు ఏమి చెబుతారని ప్రశ్నించారు. ఏదైనా మాట్లాడితే కొద్దిగైనా ఆలోచించి మాట్లాడాలని, అనవసరంగా నిందలు వేయడం తగదన్నారు. గతంలోనూ తాను ఎడ్యుకేషన్ ఫీల్డ్ లో ఉన్నానని, ఇప్పుడు తనకు అదే వింగ్ లో అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. విద్యాభివృద్ధి అంకితభావంతో పాటుపడుతానని ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర స్పష్టం చేశారు.














Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310